# ఒక కత్తి - రెండు పనులు

రచన: శ్రీ వేముల ప్రభాకర్.

రోడ్డుకు యిరువైపులా పూలు-పళ్ళు కనులు పండువు చేస్తున్నాయి. కాని వాటితో వచ్చే చెత్త, వాటిని తెచ్చే లారీలు, మనుషులు కలిసి ఈ రోడ్డును మురికికూపంచేశాయి. యెన్నడు సైకిలుపై వచ్చినా ఈ రోడ్డు ముందుకు సాగనివ్వదు సైకిలు యెక్కడంకన్నా దిగితేనే తొందరగా వెళ్ళగల్చునని కాలినడక మొదలుపెట్టాను. ఎడమచేతి వైపు నేను అనుకున్న బోర్డు కనిపించింది. "హమ్మయ్య" అనుకుని సైకిల్ మలుపుతిప్పాను.

"సాబ్ సైకిల్ రోక్ దో! స్టాండ్ మే లగాదో!" అంటూ వచ్చాడు వాచ్ మన్.

'నేను యిప్పుడే అయిదునిమిషాల్లో వెళ్ళిపోతాను అంతదానికి స్టాండులో పెట్టడం యెందు''కన్నా వినిపించుకోడు ఎందుకు వినిపించుకుంటాడు స్టాండులో సైకిల్ పెట్టిస్తే వచ్చేదాంట్లో ఆ వాచ్ మన్ కుకూడా కమీషన్ ఉంటుందాయె. ఇటు ఉద్యోగధర్మం నిర్వర్తిస్తున్నాడు అటు సైడ్ బిజినెస్ నడుపుతున్నాడు. గత్యంతరంలేక సైకిలు స్టాండులో పడేసి, సైకిల్ కు తగిలించి ఉన్న బియ్యపు సంచి తీసుకుని ముందుకు నడిచాడు.

ఇచ్చట ఒక సహకార సంస్థ నడుపుతున్న గోడౌన్ వుంది. అందులో రకరకాల బియ్యం, పప్పులు సరసమైన ధరలకు లభిస్తాయని చెప్పగా విని వచ్చాను. బజారుకన్నా తక్కువ ధరకు మంచి సరకు లభిస్తుందంటే ఆశపడి మరీ వచ్చాను.

అదిఒక పెద్ద గోడౌన్. అందులో కనీసం అయిదువేల క్వింటాళ్ళ ధాన్యమైనా నిలువవుంచవచ్చు. బియ్యం, పప్పులు ఏ వరసకావరస పేర్చిపెట్టారు. తూచడానికి ఒకపెద్ద ప్లాట్ ఫారం కాంట్ పెట్టారు. కొనుక్కోడానికి వచ్చిన పలువురున్నారు. అయిదారుగురు హమాలీలు ఉన్నారు. సరుకులు తూచిపెట్టడానికి ఒక గోడౌన్ కీపరు ఉన్నాడు, ఆయన బిల్ చూస్తూ చెబుతుంటే హమాలీలు తూచిపెడుతున్నారు. అక్కడున్న నలుగురు బియ్యం తీసుకుని ప్రక్కకు తొలిగాక గోడౌన్ కీపరుతో నన్ను నేను పరిచయం చేసుకుని నేను వచ్చిన పని చెప్పాను.

ఆయనపేరు శ్రీకాంత్ ట "మీకేబియ్యం కావాలో చూసుకోండి. ఇవి ములగొలుకలు నెల్లూరులో పండినవి, ఇవి మసూరిలంటారు క్రిష్ణాజిల్లాలో పండినవి, ఇవి చూశారు! అక్కుళ్ళు బియ్యం-కొంచెం నూక వుంటుంది మీకు యేవి కావాలో చెప్పండి'' అన్నాడు.

"నేను మేస్టారునని చెప్పానుగదండీ! వరిపంటగురించి వరుసగా మూడు పీరియడ్ లు బోధించమన్నా, బోధిస్తాను కాని బియ్యం చూసి మంచిచెడ్డలు చెప్పమంటే నాకు చేతకాదు'' అన్నాను నవ్వుకుంటూ, ఆయనకూడా నవ్వుతూనే "అయితే నేను చెబుతున్నాను ఈ నెల్లూరు బియ్యం తీసుకోండి. నూక, రాయి యేమీ ఉండదు ఊరికే కడిగిపెట్టుకోవచ్చు'' అన్నాడు.

"'నెల్లూరు నెరజాణ' అన్నమాటే విన్నాను కాని నెల్లూరు బియ్యంకూడా పేరుపడిని వున్నాయన్నమాట మరి ధరసంగతి చెప్పరేం?''

"రూపాయి ఎనభై రెండుపైసలకు కిలోగ్రాం వంద కిలోలు తీసుకుంటే రూపాయి ఎనభై పైసలు పడుతుంది.''

"సహకార సంస్థల ధరలుకూడా సామాన్యునికి సహకరించేలా లేవు. సరే! బిల్ ఎక్కడ చేయించుకోవాలో చెప్పండి'' అన్నాను హాస్యధోరణిలోనే.

"బిల్ అటు ప్రక్కనున్న కౌంటర్ లో చేస్తారు కాని వేస్టారు అది మూసివేశారండి''

"అయిదుగంటలదాకా ఉంటుందని విన్నానే! ఇపుడు నాలుగున్నరే అవుతుంది కదండీ''

"బిల్ వ్రాసేవారు నాలుగున్నర వరకే ఉంటారండి! ఆ తరవాత అరగంట డబ్బు లెక్కపెట్టి అఫీసులో చెల్లించాల్సి వుంటుంది కదా!''

"అంటే నాపని వుట్టిదేనన్నమాట ఎంతో ప్రయాసపడి ఒక గంట పర్మిషన్ తీసుకుని వచ్చానండి స్కూలునుండి. సహకార సంస్థలో ధరలు సహకరించకున్నా కనీసం మీరైనా సహకరించండి'' అన్నాను బ్రతిమీలాడుతున్నట్టు.

"నేను వెళ్ళినా యిపుడు వారు బిల్ చేయరండి కాని మా స్నేహితునికోసం చేయించిపెట్టిన ముప్పై కిలోల బిల్ వుంది. మీకు కావాలంటే డబ్బుయిచ్చి పట్టుకుపోండి నేను రేపు మళ్ళీ చేయించి పట్టుకుపోతాను'' అన్నాడు శ్రీకాంత్.

ఆయనకు ధన్యవాదాలు తెలుపుకుని డబ్బిచ్చేశాను, టీలు తెప్పించుకుని తాగి తీరికగా కూర్చున్న హమాలీలు నా దగ్గరున్న సంచి తీసుకుని బియ్యం తూచసాగారు.

ఇంతలోనే వాచ్ మన్ ఒక సర్వర్ కుర్రవాని జుట్టు పట్టుకుని గోడౌన్ కు లాక్కొచ్చాడు. కుర్రవాడి చేతిలో టీపాయ్, ఖాళీ కప్పులు వున్నాయి

స్థాపితం: 1960 ఫోన్: 21098

బనియన్ల తయారింపులో మా ప్రత్యేక తయారింపులు :

※ గాయత్రి ఫైన్ — సరైన కొలత.
※ విన్‌షా ఫైన్ — సరైన కొలత.
※ T. N. H స్పెషల్ — సరైన కొలత.
※ హాంగ్ కాంగ్ — (రీసైజు)
※ నైలాన్ బనియన్లు (రీసైజు)

— తయారించువారు —

THE NANJAPPA HOSIERIES : TIRUPUR - 638602.

T.N.H TRADE MARK

వాచ్‌మెన్ వాని చేతిలోనుండి టీపాయ్ తీసుకొని గోడౌన్ కీపర్ ముందున్న బల్లమీద పెట్టాడు.

శ్రీకాంత్ "ఏమిటిది టీయేనా, నేను చెప్పలేదే" అంటున్నాడు.

"అది చాయగాదు సార్ మీరే చూడండి." అంటూ టీపాయ్ మూత తీశాడు వాచ్‌మన్ అందులో నిండా బియ్యమున్నాయి

అంతా ఆశ్చర్యంగా చూడసాగాము. వర్రవాడు యిప్పుడే టీ పట్టుకొచ్చాడు హమాలీల కోసం. వారూ, మేమూ చూస్తూండగనే బియ్యం యెలా పోసుకు పోయాడు? నాకేమి అర్థంకాలేదు.

సంగతి గ్రహించుకున్న గోడౌన్ కీపర్ కుర్చీమీది నుండి లేచి వర్రాన్ని లాగి ఒక్క చెంపదెబ్బ కొట్టాడు.

వాడు యేడుస్తూ "నాకేం తెలియదు సార్! గోదాం లోని మీ హమాలీలే చాయ తెప్పించుకొని తాగి పైస లియ్యమంటే యియ్యక దీన్నిండా బియ్యం పోసిచ్చినారు" అన్నాడు.

శ్రీకాంత్ కోపంగా హమాలీల వైపు తిరిగి "ఎవర్రా ఆ పని చేసింది" అన్నాడు.

ఎవడి నోటా మాట రావడంలేదు. అంతా ఒకరి మొంగా లొకరు చూసుకోసాగారు.

"చెబుతారా లేదురా? యెవడా బియ్యం పోసింది చెప్పకపోతిరా ఆ సంగతేమిటో నేనే తేల్చుకుంటాను" అంటూ శ్రీకాంత్ గదమాయించడంతో హమాలీలనుండి ఒక పెద్దమనిషి ముందుకు వచ్చి శ్రీకాంత్ కాళ్ళు పట్టుకున్నాడు.

"అయ్యా తప్పయిపోయింది. పొద్దు గళ్ళటినుంచి ఒక్కడు కూడు తినలేదు. చాయి అన్నా తాగి ఆకలి సంపుకుందామంటే జేబులో ఒక్క పైసాగూడ లేదు."

"లేకపోతే దొంగతనం చేస్తార్రా...కొడుకుల్లారా!" మండిపడుతూనే వున్నాడు శ్రీకాంత్.

"లేదు దొరా! ఆడు ఉద్దెర యిత్తదేమోనని చాయ దాగినాము. పైసలు లేంది నేను యిక్కడినుంచి పోనంటే, గిన్ని బియ్యము పోసినాము దొరా! తప్పైంది దొరా!!" అంటూ వాడు కాళ్లు విడువకుండా పట్టుకుని బ్రతిమిలాడ సాగాడు.

శ్రీకాంత్ వినే స్థితిలో లేడు. వాన్ని కాళ్ళపైనుండి తోసివేస్తూ "అన్నీ దొంగబుద్ధులు. ఒక్కన్ని నమ్మేట్టు లేదు. ఇలా మీరు ఎన్నిసార్లు చేశారో యేమో? రేపు ఎదైనా అయితే నా కొంప మునుగుతుంది. ఈసారి మీకు బుద్ధి చెప్పక ఊరుకునేది లేదు." అని బల్లసొరుగులో నుండి తెల్లకాగితం తీసి రిపోర్ట్ రాయసాగాడు అక్కడే వున్న మిగతా హమాలీలు కూడా గాబరా పడిపోతూ వచ్చి శ్రీకాంత్‌ను బతిమాలుకో సాగారు.

"కూటికి దిక్కు లేనోళ్ళము దొరా! మీరు రిపోర్ట్ రాసిత్తే మా నౌకరి పోతది నౌకరి పోతే కడుపు ఎండి సత్తము. మా కన్న ముందు మా పెండ్లాం పిల్లలు సత్తరు, మీరు దయుంచాలి" అని యెన్ని విధాల బతిమాలుకున్నా వినకుండా రిపోర్టు పూర్తి చేసి ఆఫీసులోనికి పంపాడు.

హమాలీలంతా దిక్కుమొగం వేశారు. అంతా నలభై యాభై సంవత్సరాల మధ్య వయస్సు వారు. బస్తాలు మోసి వారి వీపులు రాటు దేరాయి. తూచి...తూచి వారి చేతులు ఉక్కుపిడచలయ్యాయి. కాని పాతిక ఏళ్ళయినా లేని గోడౌన్ కీపరు ముందు, కలం యెత్తి నాలుగు ముక్కలు రాయగలిన గోడౌన్ కీపరు ముందు వారి వయసు వారి కష్టం, అనుభవం గాలిలో ఊదేసిన చుట్ట పొగలా ఎగిరిపోయాయి.

"దొరా! ఈ ఆఫీసు పుట్టినప్పటినుంచి గోదాంల పని చేస్తున్నాము. యాభయి రూపాయల కిరాయింట్ల నలుగురితో పని మొదలు పెట్టిన ఆఫీసు ఇయ్యాల అయిదు అచ్చుల బంగ్లాలకు వచ్చింది. వన్నూరు మందిని పెట్టుకొని పని చేపిత్తున్నది. దొరా! మేము ఇరువయయిదు యేండ్లనాడు యెట్లున్నామో ఇయ్యాల్ల గట్లనే వున్నాం. యెనుపోతుల తీరుగ పనిచేత్తె గాని పొట్టగడవలేదు. రేపు రేపు యీ యింత నౌకరు పోతే మా గతేంగాను. మీకు ఒక్కడు గాకపోతే పదిమంది పనోళ్లు దొరుకుతారు. కాని దొరా! మాకు నౌకరోడిత్తడు?" అంటూ బావురు మన్నాడు హమాలీ పెద్దమనిషి.

"ఇక్కడ నా దగ్గర యేం చెప్పుకున్నా లాభంలేదు. వెళ్ళి ఆ ఆఫీసరుకు చెప్పుకోపో" అంటూ శ్రీకాంత్ మొగం తిప్పేసుకున్నాడు.

వచ్చే కళ్ళ నీళ్ళను అపుకుంటూ చెకలని గుండెలతో హమాలీ పెద్దమనిషి 'దొరా మేము జాడంగా మీ అసుంటి దొరలు యెందరో అచ్చిండ్రు, యెందరో పోయిండ్రు. యెప్పుడన్నా తప్పుచేత్తె దిక్కులేని ముండ కొడుకులని కాపాడు కచ్చిండ్రు. గిట్లమా పొట్టలు గొట్టే పనులం జేయలేదు. ఆ దొరల తీరుగ మీరు గూడ యెన్నో పనులు జేయించుకున్నారు మాతోని. యియ్యాల్ల అన్ని మరిసిపోయినారు. మా చాలెడు బియ్యం దొంగ తనంతోని ఆఫీసు మునిగేదిలేదు. ఈ ఒక్క అధారము పోతె మా గతేమైతదో! మీరే మళ్లొక్కసారి యిసారము జేయండి'' అన్నాడు.

వాని మాటలు వింటున్న నాకు విపరీతమైన జాలి పుట్టుకొచ్చింది.

"ఏమండీ శ్రీకాంత్ గారు! వెళ్ళి మీ రిపోర్టు విడ్రా చేసుకుని, ఆ ఆఫీసరుకు నచ్చచెప్పండి పాపం దిక్కులేని వాళ్లు" అన్నాను ఉండలేక.

"రిపోర్టు చేయడమూ, వెళ్ళి విడ్రా చేసుకోవడం అంతా నా యిష్టమేనంటారా? పై వాళ్లు యేమనుకుంటారు. అయినా వీళ్ళ సంగతి మీకు తెలువదు మేష్టారూ! పగటి దొంగలు, చూస్తూండగానే ఏ బస్తా మటుమాయం చేయగలరు" అన్నాడు మీరెందుకు వస్తున్నారు మధ్య అన్నట్టు.

"ఎందుకు వచ్చిన గొడవలే" అనుకుని "సరే నాకు బియ్యమైతే యిప్పించండి వెళ్ళిపోతాను" అన్నాను.

అప్పటికే తూచిన బియ్యాన్ని ఆ హమాలీలే బయట పెట్టారు. నేను రిక్షా కోసం వెళ్ళాను. బయటినుండి రిక్షా తీసుకుని వచ్చేసరికి హమాలీలు లేకుండా గోడౌన్ బోసిగా కనిపించింది. 'అప్పుడే యెటు వెళ్ళారు? బహుశా యీ ఆఫీసరు పిలిచాడేమో?'' వారి గురించి తెలుసుకోవాలన్న కుతూహలం నాకున్నా శ్రీకాంత్‌ను అడుగ బుద్ధేయలేదు.

"బిల్ యిస్తారా నేను వెళ్ళొస్తాను" అని మాత్రమే అడిగాను.

హమాలీలు చెప్పుకున్న గోడు ఆయనను యేమాత్రమూ కదిలించినట్టు లేదు. నిర్విచారంగా మామూలుగా రాసుకుంటూన్నవాడల్లా "యిప్పుడే వస్తాను వుండండి" అంటూ జేబులోనుండి ఆయన స్నేహితునికోసం రాయించుకున్నానన్న బిల్ తీసి దానిపై 'స్టాక్ యిష్యూడ్' అని రాసి సంతకము చేసి నాకు ఒరిజినల్ బిల్ యిచ్చారు. డూప్లికేట్ బిల్ రికార్డులో పెట్టుకున్నాడు. నేనది జేబులో పెట్టుకుని బియ్యం రిక్షాలో వేయించుకుని నడిచాను. రిక్షా ముందుకు సాగింది. నేను స్టాండులోనుండి సైకిలు తీసుకుని దానివెంట కదిలాను. వాచ్‌మెన్ రిక్షా అపి బిల్ అడుగుతున్నాడు. నేను వెళ్ళి బిల్ చూపించాక వదిలాడు. గేట్ దగ్గరే విచారంతో కూర్చున్న ఇద్దరు హమాలీలు నన్ను చూస్తూనే తలవంచుకున్నారు. నేను వారిని మాటాడించకుండా వుండలేక "యేమయింది... మీ ఆఫీసరు యేమన్నాడు అని అడిగాను."

"పనుల కెళ్ళి తీసేసిండ్రు దొరా! నాలుగు రోజులల్ల విచారము జేసి చెప్పుతరట" అన్నారు. నాకు బాధనిపించింది. వాళ్ళ మనసు నిండా విచారమూ, దుఃఖమూ వున్నాయి. కాని ఓదార్చే తీరిక నాకు లేదు. ఒక రూపాయి తీసి చేతిలో పెట్టి సైకిలెక్కాను. వాళ్ళు కృతజ్ఞతా భావంతో నన్నే చూడసాగారు. నేను రిక్షాను అనుసరిస్తూ వచ్చేశాను.

• • •

మరునాడు స్కూల్లో మిత్రుడు రఘునాథంతో మాటాడుతూ కూర్చున్నాను. మాటల సందర్భంలో ఆయనే

ESTD : 1969 PHONE 21098

సాటిలేని పంజు టెక్స్.

P. టెక్స్ హీరో, హాంక్ కాంగ్ ఫైన్.

మరియు

అనేక రకముల తయారింపులు.

తయారించువారు :

THE PANJU TEXTILES, TIRUPUR-638602.



అడిగాడు. "ఏం గురూ నిన్న లాస్ట్ హవర్‌లో కనిపించలేదు? రూటు వెళ్ళావు" అని.

"బియ్యం తేవడానికి అదేదో సహకారసంస్థకు వెళ్ళా" నన్నాను.

"ఏది! మా శ్రీకాంత్ గాడు పనిచేస్తున్న ఆఫీసుకా" అన్నాడు రఘునాథ్.

"మీ శ్రీకాంత్? అంటే గోడౌన్ కీపరు. శ్రీకాంత్‌ను మీ రెరుగుదురా?" నేను ఆశ్చర్యపోతూ అడిగాను.

"ఔనండీ! చదువులో వాడు నాకు రెండుసంవత్సరాలు జూనియర్. మా యింటి దగ్గరే ఉంటాడు నేనెప్పుడూ బియ్యం అక్కడే తెచ్చుకుంటాను. మీ రేరకం బియ్యం తెచ్చారు?" అని అడిగాడు.

నేను వాటిపేరే మరిచిపోయాను. జేబులోనే వున్న బిల్ తీసి చూపించాను రఘునాథ్‌కు.

ఆయన బిల్ చూస్తూ "నెల్లూరు మొలగొలుకులా! నేను కూడా మొన్న యివే తెచ్చాను. సరిగ్గా నేనూ మూడు కిలోలే తెచ్చాను. అరెరే... ఈ బిల్ నేను చేయించిన బిల్. దీనిమీద నేను బియ్యం తెచ్చుకున్నాను. నన్ను ఫూల్ చేయడం లేదుకదా!" అన్నాడు విస్తుపోతూ.

"స్వయంగా నేనే వెళ్ళి, అక్కడాలా తూకాలు నాలుగు రూపాయల అరవై పైసలిచ్చి బియ్యం తెచ్చుకుంటే బిల్లు నీదంటావేమిటి?" నేను మరింత విస్తుపోతూ అన్నాను.

"అయితే ఇదిగో పేరు చూడూ!" అన్నాడు బిల్‌ను చూపిస్తూ.

దానిపై రఘునాథ్ అని వ్రాసివుంది. "మా స్నేహితుని కోసం చేయించిన బిల్ వుంది తీసుకోండి నేను మళ్ళీ చేయించుకుంటానంటే తీసుకున్నానే కాని ఆ బిల్ ఎవరి పేరిటుంది? నేను చూడలేదు. రఘునాథ్ బిల్ చేయించి, బియ్యంకూడా తెచ్చుకున్నాక మళ్ళీ ఆ బిల్ గోడౌన్ కీపర్ చేతికెలా పోతుంది. పోయిందిగాక! చెల్లిన బిల్లే చెల్లడమేమిటి? నాకేమి అర్థం కాలేదు. అదే ప్రశ్న అడిగేను రఘునాథ్‌ను.

ఆయన బిగ్గరగా నవ్వుతూ "ఓ...అదా సంగతి నాకూ యిప్పుడే అర్థమౌతుంది, ఆయన నా దగ్గర బిల్ ఎందుకు అడిగితీసుకు పోతున్నాడో నన్న సంగతి!" అన్నాడు.

"అసలు సంగతేమిటో చెప్పు" అన్నాను నేను.

"ఏముంది నేను బియ్యం తీసుకున్న తరువాతే నా దగ్గర ఒరిజినల్ బిల్ అడిగి తీసుకుంటాడు. ఆఫీసు రికార్డ్ కోసం వుంచుకున్న డూప్లికేట్ బిల్‌ను అవసరంలో చూపించకుండా ఆ ఒరిజినల్ ఈ డూప్లికేట్ కలిపి

యెవరికైనా అమ్మేస్తాడు. బిల్లుంది కాబట్టి గేట్ దగ్గర వాచ్‌మన్ వదిలిపెడతాడు అంతే."

దోసెడు ధాన్యం దొంగతనం చేసినందుకు హమాలీలను సస్పెండ్ చేయించిన శ్రీకాంత్ గురించి యిలా వినాల్సి రావడంతో నా ఆశ్చర్యానికి అంతులేదు.

అయితే యిలా ఎంతదాకా అమ్ముకుంటాడు? లేని స్టాక్ మాత్రం ఎక్కడనుండి వస్తుంది? దానికో లెక్క వుండదా? రేపు దాని లెక్క చూపించాల్సిన బాధ్యత యీయన పైన లేదా?" నేను ప్రశ్నల వర్షం కురిపించాను.

రఘునాథ్ గుండె సర్దుకుని "లెక్క చూపించాల్సిన బాధ్యత అంటావా? వుంది, లేకేం. కానీ ఇలా అమ్మకో డానికి కారణం వుంది. ఇవ్వాళ రైల్వే వ్యాగనులో వెయ్యి బస్తాల బియ్యం వచ్చాయనుకో అందులో నూరు బస్తాలు వర్షపు జల్లుకొట్టి తడిసినాయనుకుందాము. బస్తాకు పదికిలోలు తడిసి చెడిపోతే వంద బస్తాలకు చెడిపోయిన బియ్యం ఆఫీసుకు వాళ్లు చెడిపోయిన బియ్యం తీసివేసి మంచివే అమ్మమంటారు. కొనేవాళ్ళు బాధపడతారని గోడౌన్ కీపర్ సరేనంటాడు. తను చేసేది చేస్తాడు.

"అంటే!!"

"ఏముంది; చెడిపోయిన బియ్యం, మంచి కలిపి అమ్మేస్తాడు. తద్వారా పది బస్తాల బియ్యం మిగులుతాయి. కాదు, ఎనిమిది బస్తాలే మిగులుతాయనుకుందాం. పదిహేను వందల రూపాయలు ఎక్కడికీ పోవు"

ఒకోసారి నాలుగు మాసాలదాకా జీతపురాళ్ళ మొగం చూడలేని పంతులును కాబట్టి గోడౌన్ కీపర్ మిగులుబాటు నెలలో వుంటుందని వినేసరికి గుండె ఆగినంత పనైంది.

"పదిహేను వందలే!!" అన్నాను.

"అంతేనా! యింకా చెబుతా విను" అంటూ మళ్ళీ ఓ మారు గుండె సర్దుకున్నాడు రఘునాథ్.

"బ్రదర్ చెప్పిందొక్క ఉదాహరణ చాలు. యిక ఆపివేయ్' అన్నాను. వరుసగా ఆయన గోడౌన్ లూప్ హోల్స్ అన్నీ చెబుతూ పోతుంటే, నేను వింటూ పోతుంటే యిది ఒక కథకాకుండా వ్యాసమై కూర్చుంటుంది. తెలియనివారు నేర్చుకుపోతారన్న భయంకూడా కలిగింది. అక్కడికి ఆయన తన ప్రసంగాన్ని ఆపి సిగరెట్ ముట్టించాడు. నాకు ఒకటి అందించాడు.

స్టాఫ్ రూములో సిగరెట్ పొగ మేఘాలులేచాయి. ఆ మేఘాల్లో శ్రీకాంత్ కనిపించాడు, ఆయన మొఖంలో గర్వం కనుపించింది, అది విజయగర్వం. ధర్మానికికాదు, అధర్మానికి. ఆ పొగ మేఘాల్లోనే నాకు హమాలీలు కనుపించారు. వారి మొగాల్లో దీనత్వం కనుపించింది. తప్పుచేసి దొరికిపోయిన తాలూకు భావాలతో ఆ దీనత్వం హీనత్వాన్ని తోడుచేసుకుంది. వాళ్ళు హీనులు అవడానికి కారణం ఆకలి. కాని శ్రీకాంత్ కూడా అదే తప్పుకు పాల్పడ్డాడు, దీనికి కారణం ఆకలికాదు అత్యాశ. తను దొంగ అయికూడా దొంగతనం చేసిన వారిని నిందించాడు. ముందు ఆఫీసర్ల దృష్టిలో తను మంచివాడు కావాలి. ఆ మంచిదనం పరదా చాటున యెన్ని దొంగతనాలైనా దాగుతాయన్నదే ఆయన విశ్వాసము. ఆయన ధనవంతుడు కావాలని దొంగతనం చేసినా, హమాలీలు ఆ పూటకు దిక్కులేక దొంగతనం చేసినా సమాజం దృష్టిలో యిద్దరూ దొంగలే. హమాలీలు అక్షరజ్ఞానంలేని దొంగలైతే శ్రీకాంత్ చదువుకున్న తెలివిని ఉపయోగించి కాగితాలతో నేర్పుగా దొంగతనం చేయించి నెగ్గాడు. దొంగతనం చేస్తూకూడా దొరబతుకు యెలా బ్రతకాలో ఆయన చదువుద్వారా గ్రహించాడు. చదువులు మనిషిలో సంస్కారం పెంచుతాయని మన మనుకుంటున్నాం. కాని అవి పెంచేది జ్ఞానం మాత్రమే. జ్ఞానం కత్తిలాంటిది. డాక్టరు చేతిలోపడి నిండుప్రాణాలను కాపాడడంలో వినియోగపడుతుంది. అదే కత్తి హంతకుని చేతిలోపడి నిండుప్రాణాలు తీస్తుంది.

